ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024 | 5 | అనంతపురం



అనారోగ్యంతో చిరుత మృతి



మృతి చెందిన చిరుత

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని భీమునిపల్లి సమీపంలోని కొక్కిరాయికొండలో ఆడ చిరుతపులి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించింది. ఉపాధిహామి పథకం క్షేత్రస్థాయి సహాయకుడు బాషా అటుగా వెళ్తూ చిరుత మృతదేహాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ, పశువైద్యశాఖ, పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని చిరుతపులిని పరిశీలించారు. అటవీశాఖ రెంజ్ అధికారి మధుబాబు, సెక్షన్ అధికారి నారపరెడ్డి ఆధ్వర్యంలో చిరుత మృతదేహాన్ని గుత్తికి తరలించారు. గురువారం రోజున చిరుతకు పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేస్తామని బీట్ అధికారిణి మాధవి తెలిపారు.

జాగ్రత్తగా ఈవీఎంల ర్యాండమైజేషన్

ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్



ఈవీఎంలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం ఏర్పాట్లను జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం నాడు అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి చేపట్టే ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం ఎన్ని టేబుల్స్, కౌంటర్స్ ఏర్పాటు చేసుకోవాలి, తదితర వివరాలను ఆరా తీశారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ కోసం పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవో జి.వెంకటేష్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, తహశీల్దార్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వాలంటీర్ల రాజీనామా



బెళుగుప్ప మండలంలో రాజీనామా ప్రతులను అందజేస్తున్న వాలంటీర్లు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని వాలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా వారి రాజీనామా పత్రాలను ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సుబ్బరాజు, పంచాయతీ సెక్రటరీ వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్నామన్నారు. అలాంటి తమపై టిడిపి అధినేత చంద్రబాబు కక్ష సాధింపుకు దిగడం బాధాకరమన్నారు. అందువల్లే రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఉరవకొండ : విడపనకల్లు మండలంలో వాలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా ప్రతులను ఎంపిడిఒ కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ వాలంటీర్లపై టిడిపి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. టిడిపి తీరును నిరసిస్తూ రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో గడేకల్, విడపనకల్, కరకముక్కల, వి.కొత్తకోట చీకలగురికి, ఉండబండ తదితర గ్రామాల వాలంటీర్లు ఉన్నారు.


ప్రతి లబ్ధిదారునికీ పింఛను అందజేస్తాం

కళ్యాణదుర్గం రూరల్ : ప్రతి లబ్ధిదారునికీ పింఛన్ సొమ్మును అందజేస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాణీ సుస్మిత తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నర్సారెడ్డితో కలిసి సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని అన్నివార్డులు, గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పర్యటించి లబ్ధిదారులకు తప్పనిసరిగా పింఛన్ అందజేయాలని సూచించారు. తమకు పెన్షన్ అందలేదని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పింఛను కోసం అనంతపురంలోని ఓ సచివాలయంవద్ద వృద్ధుని పడిగాపులు

సామాజిక పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతవుల పాట్లు అన్నీఇన్నీ కావు. బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పింఛన్లను సచివాలయాల వద్ద పంపిణీ చేపడతారని చెప్పడంతో ఉదయాన్నే సచివాలయాల వద్దకు లబ్ధిదారులు అందరూ చేరుకున్నారు. సచివాలయాలకు పింఛను డబ్బులు చేరలేదు. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీవ్రమైన ఎండవేడిమి మధ్య సచివాలయాల వద్ద ఉండలేక సతమతం అయ్యారు. ఇక సచివాలయ ఉద్యోగులు డబ్బుల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. సాయంత్రం వరకు వారికి డబ్బులు చేతికందకపోవడంతో పింఛను పంపిణీని మొదటి రోజు సక్రమంగా చేయలేకపోయారు.



పింఛను పాట్లు..!



ఉదయం 10 గంటలు అయినా పుట్లూరులో తెరుచుకోని సచివాలయ కార్యాలయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల కోడ్ ముందు వరకు ప్రతి నెలా 1వ తేదీ ముందే రోజే సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకునేవారు. ఉదయాన్నే పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి వాలంటీర్ల చేత డబ్బుల పంపిణీ చేయించేవారు. ఎన్నికలు సమీపించడంతో వాలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ చేపట్టవద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో సచివాలయాల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం రాత్రికి కూడా డబ్బులు సచివాలయ సిబ్బందికి చేరలేదు. దీంతో సచివాలయ సిబ్బంది బుధవారం ఉదయం నుంచి పింఛను పంపిణీకి అవసరమైన డబ్బుల కోసం బ్యాంకుల వద్దకెళ్లారు. బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమకాకపోవడంతో సిబ్బంది బ్యాంకుల వద్ద, వృద్ధులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మండుటెండల్లో పింఛను ఎప్పుడొస్తుందా అంటూ ఎదురు చూస్తూ కూర్చొండిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలకుపైన కొంత మంది డబ్బులు జమవడంతో డ్రా చేసుకుని సచివాలయ సిబ్బంది సాయంత్రం ఐదు గంటల నుంచి పంపిణీ ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తంగా మొదటి రోజు 25 శాతం వరకు పింఛన్లు పంపిణీ అయ్యాయని అధికారులు చెబుతున్నారు.



డి.హిరేహాల్‌లో పింఛన్ పంపిణీ చేయకపోవడంతో సచివాలయం బయట ఎండలో వేచి ఉన్న వృద్ధులు

25 శాతం వరకు పంపిణీ

అనంతపురం జిల్లాలో మొత్తం 2,89,131 మంది సామాజిక పింఛను లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికి కలిపి రూ.86.58 కోట్లు పింఛను డబ్బులు అందాల్సి ఉంది. సాయంత్రానికి బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకున్న సచివాలయ సిబ్బంది 25 శాతం మంది వరకు పంపిణీని పూర్తి చేశారు. సత్యసాయి జిల్లాలో 2,72,767 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో 65 వేల మంది వరకు మొదటి రోజు పంపిణీ పూర్తయింది. దాదాపుగా ఇక్కడ కూడా 25 శాతం మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలియజేశార. పుట్టపర్తి పట్టణానికి సంబంధించి యూనియన్ బ్యాంకులో డబ్బులు జమకాలేదు. దీంతో అక్కడ బుధవారం నాడు పింఛను పంపిణీ చేయనున్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఈనెల 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది.

- సిబ్బంది బ్యాంకుల వద్ద.. వృద్ధులు సచివాలయాల వద్ద పడిగాపులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి
- సాయంత్రానికి వచ్చిన నగదు
- 5గంటల తర్వాత పంపిణీ ప్రారంభం

నీరు..నీడ కరువు..!

పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయాల వద్ద చేపట్టడంతో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడిమికి కనీసం కూర్చొవడానికి స్థలం లేక అల్లాడిపోయారు. తాగేందుకు నీరు లేక గొంతు తడారిపోయింది. ఏ సచివాలయంలో కూడా అధికారులు నీడ కోసం సేమియానా, తాగునీటి వసతి కల్పించలేదు. పెద్ద సంఖ్యలో వృద్ధులు, మహిళలు సచివాలయం వద్దకు వస్తారని ముందుగా తెలిసినా అధికారులు వారి కోసం నీడ, నీటి వసతి ఏర్పాటు చేకపోవడంపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్‌ను గద్దె దింపడమే ధ్యేయంగా పని చేస్తాం

అనంత టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మినారాయణ

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా అన్ని ప్రాంతాలనూ సర్వనాశనం చేసిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని గద్దె దింపడమే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపిలు కలిసికట్టుగా పని చేస్తాయని అనంతపురం అర్బన్ నియోజకవర్గం కూటమి అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ స్పష్టం చేశారు. టికెట్ల ప్రకటన అనంతరం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి సమావేశాన్ని బుధవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ తనకు అనంతపురంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. టికెట్ ప్రకటన తర్వాత పార్టీలో కొన్ని అసంతృప్తులు ఉన్నా అధిష్టానం వాటిని పరిష్కరిస్తుందని తెలియజేశారు. తమ పార్టీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తేసేలా టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అర్బన్ నియోజకవర్గంలో న్యాయపోరాటం చేస్తామన్నారు. అర్బన్ నియోజకవర్గంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. పారిశ్రామికవేత్తగా ఉన్న తాను నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చే దిశగా కృషి చేస్తానని తెలియజేశారు. పింఛన్ల పంపిణీ విషయంలో అధికార పార్టీ కొత్త డ్రామాలకు తెర లేపిందన్నారు. కావాలనే వైసిపి పింఛన్ల పంపిణీని రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మినారాయణ

అన్ని స్థానాల్లోనూ విజయం సాధిస్తాం

టిడిపి అనంత పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం పార్లమెంట్‌తో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని అనంతపురం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ తెలియజేశారు. తాము నాన్ లోకల్ అంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎంపీలుగా పోటీ చేసిన తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్ ఈ జిల్లా వాసులే కాదన్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంటు బరిలో ఉన్న శంకర్ నారాయణ ధర్మవరం వాసి అన్నారు. హిందూపురం పార్లమెంట్ బరిలో ఉన్న శాంతమ్మ బళ్లారి ప్రాంతానికి చెందిన మహిళ అన్నారు. వీటిని మరచిన వైసిపి నాయకులు తమను మాత్రం నాన్‌లోకల్ అంటూ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతపురం పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ చాలా బలంగా ఉందని వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ స్థానంతో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో టిడిపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లలిత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జెఎల్.మురళి, మాజీ మేయర్ మదమంచి స్వరూప, మహిళా విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, సిమెంట్ పోలన్న, టిడిపి సీనియర్ మాసినేని రామయ్య, ఆదెన్న, రాయల్ మురళి, గుత్తా ధనుంజయ్ నాయుడు, మారుతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి అనువాదకులు అనిల్ కుమార్ మృతి



మతి చెందిన ప్రొఫెసర్ అనిల్ కుమార్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి శ్రీసత్యసాయి బాబా బోధనలు, ఉపన్యాసాలను ఆంగ్లంలో అనువదించే అనువాదకులు ప్రొఫెసర్ అనిల్ కుమార్(80) మతి చెందారు. హదయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మతి చెందారు. సుదీర్ఘకాలంగా సత్యసాయిబాబా అనువాదకులుగా అనిల్‌కుమార్ సేవలు అందించారు. ఆయన మతి పట్ల బాబా భక్తులు దిగ్భ్రాంతి చెందారు. అనిల్‌కుమార్ దేశ విదేశీయులకు సుపరిచితం అయిన వ్యక్తి. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

కెజిబివిలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గుంతకల్లు శివారులోని కస్తూరిబా పాఠశాలలో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయురాలు అవమానించారని మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. సిబ్బంది వెంటనే అప్రమత్తం అయ్యి విద్యార్థినిని కాపాడారు. ఇందుకు సంబంధించి పోలీసులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారానికి చెందిన కావ్యశ్రీ గుంతకల్లు శివారులోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. డబ్బు విషయంలో ఈ విద్యార్థిని మరో విద్యార్థినికి మధ్య వివాదం చోటు చేసుకుంది. దీనిపై కావ్యశ్రీపై మరో విద్యార్థిని ఉపాధ్యాయులకు తెలిపింది. ఈ విషయంపై పాఠశాల పీఈటీ విద్యార్థిని కావ్యశ్రీతో వివరాలు అడిగింది. డబ్బు విషయంపై విద్యార్థులు అందరి ముందు ప్రశ్నించడాన్ని అవమానంగా భావించిన కావ్యశ్రీ తరగతి గది నుంచి బయటకు వచ్చేసింది. అనంతరం హాస్టల్ గదిలోకి వెళ్లి ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకునే ప్రయత్నం చేసింది. అదష్టవశాత్తు ఫ్యాన్‌కు వేసుకున్న చున్నీ తెగిఊడిపడడంతో విద్యార్థిని కింద టేబుల్‌పై పడింది. ఇనుప టేబుల్ మీద పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో తోటి విద్యార్థులు, సిబ్బంది అక్కడికెళ్లి చూశారు. అప్పటికే కావ్యశ్రీ స్పృహ తప్పి కింద పడిపోయింది. సిబ్బంది హుటాహుటిన ఆమెను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు. ఈ విషయంపై బాధితురాలి తండ్రి రామాంజనేయులు మాట్లాడుతూ కెజిబివిలో వసతులు సక్రమంగా లేవన్నారు. వీటిపై ప్రశ్నించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలా ఇబ్బందులకు గురి చేయడం వల్లనే తన కూతురు ఆత్మహత్యకు యత్నించిందని తెలిపారు. ఉన్నతాధికారులు ఈ పాఠశాలలో విచారణ చేపట్టి వాస్తవ విషయాలు బహిర్గతం చేయాలని కోరారు. కాగా ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

సిబ్బంది స్పందించడంతో తప్పిన ప్రమాదం

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కాలువగడ్డ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న క్రీడా మైదానంలో జరుగుతున్న సీజన్-1 యునైటెడ్ ఛాంపియన్స్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గుత్తి క్రికెటర్స్ వర్సెస్ సన్నీ లెవెన్స్ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సన్నీ లెవెన్స్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన గుత్తి క్రికెటర్స్ జట్టు ఓపెనర్లు ఎం.భువనేశ్వర్, శుభారంభాన్ని అందించడంతో 13.3 ఓవర్లలో కేవలం 2 రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయాన్ని సాధించింది. భువనేశ్వర్ 21 బంతుల్లో 3 ఫోర్లతో 21 పరుగులు, ఆర్.కుమార్ 24 బంతుల్లో 5 ఫోర్లు 2 సిక్సర్లతో 42 పరుగులు, విక్రమ్ 36 బంతుల్లో 6 ఫోర్లతో 47 పరుగులతో రాణించారు. 47 పరుగులు సాధించిన విక్రమ్‌కి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా బలిజ సంక్షేమ సంఘం మండల మహిళా అధ్యక్షురాలు కందుల హేమలత గుత్తి క్రికెటర్స్ జట్టుకి జెర్సీలు స్పాన్సర్ చేశారు. అనంతరం మధ్యాహ్నం ప్రారంభమైన మ్యాచ్ లో గబ్బర్ లెవెన్స్ (అనంతపురం) వర్సెస్ గట్స్ అండ్ గ్లోరీ (బెంగళూరు) జట్ల మధ్య జరిగింది. గట్స్ అండ్ గ్లోరీ జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో4 వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోర్ చేసింది. గబ్బర్ లెవెన్స్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 130 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. గట్స్ అండ్ గ్లోరీ జట్టులోని క్రీడాకారుడు రాఘవేంద్ర మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

దూదేకుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



దూదేకుల సంఘం నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుత్తి

నూర్‌బాషా (దూదేకుల) అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ నేతత్వంలోని వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని నూర్‌బాషా (దూదేకుల) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్-ఎస్.బాజీ తెలిపారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నురుబీ మాట్లాడుతూ రాష్ట్రంలో దూదేకుల కులానికి సిఎం జగన్ పూర్తి న్యాయం చేశారన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో దూదేకుల సామాజిక వర్గానికి ఎలాంటి పదవులు లేవన్నారు. అదే జగన్ ప్రభుత్వంలో 2 కార్పొరేషన్ ఛైర్మన్లు, ఒక మేయర్, 2 మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, 13 డైరెక్టర్లు, 2 మున్సిపల్ ఛైర్మన్ పదవులను కేటాయించారన్నారు. ఇందులో గుత్తి మున్సిపాలిటీ ఉండటం సంతోషకరమన్నారు. రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో దశాబ్దాలుగా దూదేకులను కించపరిచే వ్యాఖ్యలు చేసిన వారికి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జీవో ఇచ్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఇండియన్ ముస్లిం దూదేకుల సమస్యలను పరిష్కరించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి నూర్‌బాషా (దూదేకుల) సంక్షేమ సంఘం మద్దతు ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మహబూబ్‌బాషా, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి డి.బాబా కలిసి ఎస్ఎస్.బాజీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి.షఫీ, డి.షరీఫ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు మట్టిపాటి బాషా, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి నసీరుద్దీన్, పత్తికొండ అధ్యక్షులు బషీర్ అహ్మద్, మహిళా అధ్యక్షురాలు పి.షమినా, ఆదోని యూత్ అధ్యక్షులు పి.మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బీటెక్, ఎం.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్23) రెగ్యులర్, బీ.టెక్ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీ.టెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీ.టెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ (చివరి అవకాశం), బీ.టెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ (చివరి అవకాశం), ఎం.ఫార్మసీ 1వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ 1వ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ పలితాలు, ఎం.ఫార్మసీ 1వ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడు మృతి

సిఐటియు నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పంచాయతీ కార్మికుడు రాజు (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు, తోటి కార్మికులు రాజు స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాజు గన్నెవారిపల్లి పంచాయతీలో 16ఏళ్లుగా పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ చురుగ్గా పని చేసేవాడన్నారు. కరోనా లాంటి సమయంలో కూడా ప్రాణాలకు తెగతించి పని చేశాడన్నారు. ఎన్నోఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. పంచాయతీ కార్మికుడు ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందితే పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు కనీసం చూసిన పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికులకు తక్షణమే నెలనెలా వేతనాలు, పనిచేసే సమయంలో భద్రతా పరికరాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే రాజు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ఓబయ్య, సంధ్యాభాయ్, రాణి, అచ్చమ్మ, రామాంజి, రవి, రంగా, చలపతి, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో పింఛన్ల పంపిణీ ప్రారంభం

నార్పల : మండల వ్యాప్తంగా బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించినట్లు ఎంపిడిఒ రాముడు తెలిపారు. మధ్యాహ్నంలోపు బ్యాంకు నుంచి డబ్బులను డ్రా చేసుకుని వచ్చి దాదాపు మండలవ్యాప్తంగా 9 సచివాలయాల పరిధిలో పింఛన్ పంపిణీని ప్రారంభించారన్నారు. మండలంలోని బి.పప్పూరు, బండ్లపల్లి, బొందలవాడ, దుగ్గుమర్రి, గూగూడు, హెచ్.శోదనపల్లి, కేసేపల్లి, నడిమిదొడ్డి, నాయనపల్లి సచివాలయాల్లో పంపిణీ చేశారన్నారు. మిగిలిన నార్పల, సిద్ధరాచర్ల, గంగనపల్లి, చామలూరు సచివాలయాల పరిధిలో నేడు ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకోసం ఆయా సచివాలయాల వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా ఎండలు మండిపోతుండటంతో నీడ కల్పించామన్నారు. నడవలేనివారు సచివాలయాలకు రావాల్సిన పనిలేదని, సచివాలయ సిబ్బంది ఇళ్లకు వచ్చే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

వాహనాల తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : కర్ణాటక-ఆంధ్రా సరిహద్దులోని చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోకి వచ్చే వచ్చే ప్రతి వాహనాన్ని క్షణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నారు. మద్యం, డబ్బు, మరణాయుధాలు తదితర సామాగ్రి రవాణా అవుతున్నట్లయితే పట్టుకుని ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని డీఎస్పీ తెలిపారు.

హోమ్ ఓటింగ్‌పై అవగాహన

రాయదుర్గం : హోమ్ ఓటింపై బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చిట్టిబాబు మాట్లాడుతూ ఇళ్ల వద్దే ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయాలను వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతదేవి, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDITONAL JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
O.S.No:1550/2022

Between:
Andhra Pragathi Gramena Bank Rep By its Cheif Manager PTC Branch Anantapuramu ...Plaintiff
And
Kowlepalli Malleswari and another ...Defendants

Notice To Defendant No:2
D2: G.Thirumaleshu S/o G.Jagannatham D/No:5/519, 5th Road, Anantapuramu.
పై నెంబరు దావాలో వాదికి తనకు రావలసిన బ్యాంకు ఋణము రాబట్టుటకు ప్రతివాదికి పైన దావా దాఖలు చేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన నీవు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గాని పై కోర్టు యందు అనగా 11-04-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు హాజరు కావలెను. అట్లు కానీ యెడల నీ పరోక్షమున తీర్మానించెదరని తెలియజేయడమైనది.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
G.నరసింహులు,
వాదిపరం వకీలు,అనంతపురం.

IN THE COURTOF THE HON'BLE SPECIL JUDICAL 1ST CLASS MEGISTRATE(3rd ADDL JUNIOR CIVIL JUDGE AND PRO & EXCISE COURT), ANANTAPURAMU.
I.ANo:521/2023 in O.S.No:944/2022

Between:
O.Mallikarjuna ...Plaintiff
And
K.Narayanappa (died) by LRs
1.Wife K.Vijayamma & 3 others ...Respondents/Defendents

Notice To Respondents/Defendents NO.2,3,4
2nd Respondent/Defendent K.Uma D/o Late K.Narayanappa,
3rd Respondent/Defendent K.Jayanthi D/o Late K.Narayanappa,
4th Respondent/Defendent K.Gayathri D/o Late K.Narayanappa, all are Resident of 12-3-837, Plot No.403, Jesus Nagar , Anantapuramu City & Dist.
ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ప్రతివాదులు (Respondent/Defendent) NO.2,3,4 హాజరు నిమిత్తం పై కోర్టు నందు 06-05-2024వ తేది రోజు వాయిదా వున్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా కాని, వకీలు ద్వారా కాని హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By order of the court)
S.Anjaneyulu, Advocate,
Anantapur.

IN THE COURTOF THE HON'BLE 3rd ADDL JUDGE ANANTAPURAMU.
E.P.No:344/2023 in A.ANo:67/2018

Between:
M/S Shriram Finance limited.(formerly Known as Shriram Transport Finance Company Ltd.) a Limited Company incorporate under the indian Companies Act..,1956, having its registered Office, at 123, angappa Naicken Steet, Chennai-600 001, and a branch at D.No.1/745/21, 2nd Floor Main Road Beside SBI(ADB) Bank, Kadiri, Anantapuramu (Dist) Represented By Its G.P.A Holder Mr. S.Mastan Vall, S/o.Mr.Khsaim valli, Now employed in the companies Branch collection Manager, functioning from Kadiri Branch ...D.Hr
And
1.P.Ramana Reddy
2.J.Bhasakar ...J.Dr.s

Notice TO J.Dr NO.1 & 2
1.P.Ramana ReddyS/o. Peddi Reddy, D.No11/12, Cherlopalli(Village),Brmhanapalli(P),Kadiri (M), Anantapuramu(Dist).
2.J.Bhasakar S/oNagappa, D.No11/25, Cherlopalli (Village), Brmhanapalli (P), Kadiri (M), Anantapuramu(Dist).
ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ప్రతివాదులు J.Dr. NO.1 & 2 హాజరు నిమిత్తం12-04-2024వ తేది వాయిదా వున్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా కాని, వకీలు ద్వారా కాని హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By order of the court)
D.Malleswara, Advocate
Anantapur

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
సక్షషన్ O.P.No:7/2024

Between:
N.హెమంత్ కుమార్ S/o లేట్ N.R.స్వామి,
D/No:20/184-16-A, హనుమేష్ నగర్, గుంతకల్లు ...పిటీషనర్
మరియు
Nil ...రెస్పాండెంట్

పబ్లిక్ నోటిసు
పై కేసు నందు పిటిషనర్ తన సోదరి N.వసంత కుమారి D/o లేట్ N.R.స్వామి, రిటైర్డ్ మునిసిపల్ ఉద్యోగి 20/05/2021 వ తేదిన మరణించగా పిటిషనర్ తాను ఏకైక వారసుడని సదరు లేట్ N.వసంత కుమారి గారికి క్రింద తెలిపిన షెడ్యూలులో గల రెండు బ్యాంకుల ఖాతాలలో గల మొత్తం తాను వారసునిగా చెందవలెయునని మరియు సదరు మొత్తములకు గాను సక్షషన్ సర్టిఫికెట్ జారి చేయవలసినదిగా పై కోర్టు నందు పై కేసును దాఖలు చేసి ఉన్నాడు. కావున పిటిషనర్ పరముగా సక్షషన్ సర్టిఫికెట్ జారిచేయుటకు ఎవరికైన ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల పై కోర్టు నందు వాయిదా తేది 22-04-2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల కోర్టు వారు పై కేసును చట్టపరముగా తీర్మానము చేయుదురు.

షెడ్యూలు

S. No	సెక్యూరిటీలు/డిపాజిట్లు వసూలు కావలసిన బాకీలు Etc వివరాలు	సెక్యూరిటీలు/డిపాజిట్లు వసులు కావలసిన బాకీలు మొత్తం రూ.
1.	గుంతకల్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నందు లేట్ N.వసంత కుమారి గారికి S.B.I అకౌంట్ No 11107257592 నందు గల బ్యాలెన్సు మొత్తము	రూ.3,61,312-47పై
2.	గుంతకల్లు యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నందు లేట్ N.వసంత కుమారి గారికి S.B అకౌంట్ No 014910021081970 నందు గల బ్యాలెన్సు మొత్తము	రూ.22,729=00పై
	మొత్తము అమౌంట్	రూ.3,84,041-47పై

P.G.S.బాబు, జి.లక్ష్మీపతి, పి.చంద్రకాంత్‌రెడ్డి,
అడ్వకేట్స్, గుంతకల్లు.

పింఛను కోసం వృద్ధుల పడిగాపులు

ఉదయం నుంచే సచివాలయాల వద్ద బారులు
పంపిణీ లేదని చెప్పడంతో నిరాశగా వెనక్కి

ప్రజాశక్తి-శింగనమల

సామాజిక పింఛన్ల కోసం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద పలువురు పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. ఈనెల 3వతేదీ సచివాలయ ఉద్యోగులు ఆయా సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తారని అధికారులు చెప్పడంతో ఉదయం నుంచే పింఛన్‌దారులు మండల కేంద్రంలోని సచివాలయం వద్దకు భారీ ఎత్తున తరలివచ్చారు. అయితే సచివాలయ ఉద్యోగులు వారి సమయానికి వచ్చి నేడు పంపిణీ చేస్తామని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరగా పింఛన్ సొమ్మును అందజేయాలని పలువురు పింఛన్‌దారులు కోరారు.

డి.హీరేహాల్ : మండలంలో 3వతేదీ పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో పలువురు పింఛన్‌దారులు సచివాలయం వద్ద ఉదయం నుంచే పడిగాపులు కాశారు. అయితే సచివాలయ అధికారులు కార్యాలయానికి చేరుకుని తమకు ఇంకా డబ్బు అందలేదని, రేపు రావాలంటూ సమాధానమివ్వడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులు మాట్లాడుతూ ప్రతినెలా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారని, ఇప్పుడు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అంతేగాకుండా వేసవికాలం కావడంతో నడవలేని తాము సచివాలయం వచ్చి వెళ్లాలంటే నానాఅగచాట్లు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేయాలని కోరారు.



అనంతపురంలోని ఓ సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు



శింగనమల సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

పుట్లూరు : మండలంలో 3తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని అధికారులు తెలపడంతో పలువురు పింఛన్‌దారులు మంగళవారం రాత్రి వరకూ వేచి చూశారు. అయితే పంపిణీ చేయలేదని చెప్పడంతో నిరాశగా ఎదురుచూశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కోమటికుంట్ల చవ్వా కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి నాయకులు కావాలనే టిడిపిపై బురదలేందుకు పింఛన్ పంపిణీని ఆలస్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేకుండా చేసి ఒకటో తేదీ ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. అయితే ఎన్నికల కమిషన్ సాకు చూపి టిడిపిపైకి నెట్టడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని డిమండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసు నిందితుల అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

నార్పల : మండల కేంద్రంలో ఫర్టిలైజర్ యజమాని వీరభద్ర హత్య కేసు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకట శివారెడ్డి, సిఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 1న సాయంత్రం ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని కాటం వీరభద్రుడును వేట కొడవళ్లతో నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు నార్పల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హత్యకేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న శింగనమల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. సీసీ పుటేజీలను బట్టి గోపాలం రవీంద్ర రఘుపతి, మరో బాల నేరస్తుడితో కలిసి హత్య చేసినట్లు గుర్తించారన్నారు. వ్యాపార లావాదేవీల మధ్య జరిగిన గొడవలు హత్యకు దారి తీసినట్లు నిర్ధారించుకుని కేసు దర్యాప్తు చేపట్టగా బుధవారం ఉదయం శింగనమల మండలం నాయనపల్లి క్రాస్‌లో నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి రెండు వేట కొడవళ్లు, ఒక బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. త్వరితగతిన నిందితులను అరెస్టు చేసినందుకు సిఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

రక్షణ కల్పించండి : మృతుని భార్య రేణుక

నిందితుడు రవీంద్ర రఘుపతి బంధువులు, కుటుంబ సభ్యుల నుంచి తమ కుటుంబం, పిల్లలకు రక్షణ కలించాలని మృతుడు వీరభద్ర భార్య రేణుక సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి విన్నవించారు. ఇందుకు ఎస్ఐ, సిఐ స్పందిస్తూ మీ కుటుంబానికి ఎలాంటి బెదిరింపులు వచ్చినా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. మీరు భయపడాల్సిన పని లేదని, పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

నీటిబకెట్‌లో పడి చిన్నారి మృతి



మృతిచెందిన అఖిల్

పెద్దవడుగూరు : మండలంలోని చింతలచెరువులో నీటి బకెట్‌లో పడి చిన్నారి అఖిల్ (1) మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శివ, రాధకు ఇద్దరు సంతానం. వీరిలో రెండో సంతానం 13 నెలల అఖిల్ ఆరుబయట ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటి బకెట్టులోకి పడిపోయాడు. గమనించని తల్లిదండ్రులు ఆడుకుంటున్నాడని అనుకున్నారు. కొదిసేపటికి గమణించిన తల్లిదండ్రులు చిన్నారి చూసేలోపు నీటిలో పడి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. వెంటనే పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంపై తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

నాటుసారా స్థావరంపై దాడులు

ఆత్మకూరు : మండలంలో వేపచర్ల శివార్లలో నాటుసారా తయారీ స్థావరంపై బుధవారం దాడి చేసి దాదాపు 1500 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. మరో మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా నాటుసారా జోలికెళితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొమ్మనహాల్ : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారిణి మౌనిక, ఎఒ బలరామ్ బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని లింగదహాల్ కొలగానహళ్లి ఎలెంజ్, శ్రీధర్‌ఘట్ట కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులపై ఆరాతీశారు. ముఖ్యంగా ఆయా కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీరు, వెలుతురు, తదితర ఏర్పాట్లు ఉండాలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కుళ్లాయిస్వామి, హరిప్రసాద్, శ్రీధర్‌ఘట్ట నరసింహమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

పామిడి : తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలైన పామిడి మండలం పాల్యం తండా గ్రామపంచాయతీకి చెందిన అచ్చమ్మ కుమారుడు సురేష్‌నాయక్‌కు గ్రామస్తులు తమవంతు సాయంగా బుధవారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. సురేష్‌నాయక్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో కింద పడటంతో చికిత్సకు ఇబ్బందులు కలగడంతో ఆర్థికసాయం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జుననాయక్, కురుమూర్తినాయక్, శ్రీనివాసులునాయక్, కృష్ణమూర్తినాయక్, పి.స్వామి, సురేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే అన్నివర్గాలకూ న్యాయం

ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ మేలు జరగాలంటే వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో ఒక్క కరకముక్కల గ్రామానికే దాదాపు రూ.25 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. అంతేగాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పార్టీలు, కులమత బేధాలు చూడకుండా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కాగా వాలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని జీర్ణించుకోలేని చంద్రబాబు తనవారితో ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించి అడ్డుకున్నారన్నారు. వారు ఎన్ని కుట్రలు చేసినా సంక్షేమ పథకాలు ఆగవన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి సంక్షేమాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపి కరణం పుష్పావతి, జెసిఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, సర్పంచి రామాంజనేయులురెడ్డి, ఎంపిటిసి మల్లికార్జున, పిఎసిఎస్ ఛైర్మన్, శ్రీరాములు, నాయకులు కరణం భీమిరెడ్డి, గోపాల్, అంపయ్య, ప్రసాద్, ఉమామహేశ్వర్, గిరిబాబు, సుంకన్న, నాగరాజు, రామాంజనేయులు, అంగడి వెంకటేశులు, చిట్టిబాబు. రఘురాములు, మడకశిర, యల్లప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప : త్వరలో జరిగే ఎన్నికల్లో సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని వైసిపి నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప కలిసి ఇంటింటికీ వైసిపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రత్నమ్మ, రామిరెడ్డి, మాజీ సర్పంచి రామేశ్వర్ రెడ్డి, నాయకులు రాజగోపాల్, రెట్ల నారాయణప్ప, పాతన్న, పురుషోత్తం రాజు, కర్ణాకర్ వెంకటేశులు, పాలు తిప్పేస్వామి, బండయ్య, పూల ప్రసాద్, భీమన్న, తిమ్మప్ప, తిమ్మారెడ్డి, గాజుల రాము, గురుమూర్తి, నరసింహారెడ్డి, బాబు రెడ్డి, నాగభూషణ, కిష్టప్ప, బసవరాజు,పాండు నాయక్, శిన నాయక్, గోవింద నాయక్, మాల తిప్పేస్వామి, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో 'శ్రీచైతన్య' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

అంతర్జాతీయ ఒలింపియాడ్ లెవెల్-2 ఫలితాలో నగరంలోని 9వ బ్రాంచి శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ శాంత తెలిపారు. ఈమేరకు బుధవారం విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ఒలింపిక్స్ పరీక్షలతోపాటు అనేక పోటీ పరీక్షలకు పకడ్బందీగా సన్నద్ధం అయ్యి విజయావకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన మాధవ్‌కు గ్రాండ్ ప్రైజ్ లెనోవా ట్యాబు, రెండవ స్థానంలో రీహాన్‌కు డిజిటల్ వాచ్, మూడవ స్థానంలో శ్రావణికి డిజిటల్ వాచ్, నాల్గవ స్థానంలో దీక్షిత్‌కు రెడ్‌బ్యాగ్, ఐదవ స్థానంలో తనుశ్రీ, భవ్యశ్రీ, రాజుకు లంచ్‌బాక్స్, స్పెషల్ ప్రైజ్ 35, కన్సోలేషన్ 29 ప్రైజ్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ జిల్లా కో ఆర్డినేటర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పూజ, డీన్ గంగాధర, ప్రైమరీ, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జి చంద్రకళ బటూల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ శాంత

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతిద్దాం..

ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందజేస్తూ మంచి చేసిన వైసిపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి వచ్చే ఎన్నికల్లో గెలిపిద్దామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని కందిగోపుల, చింతకుంట, చాలవేముల, రంగరాజుకుంట, కుమ్మనమల, తురకవానిపల్లి, కొండగారికుంట, రంగినేపల్లి గ్రామాలో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతినెలా 1వ తేదీన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు వాలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించేవారన్నారు. అయితే ప్రస్తుతం టిడిపి నాయకులు ఎన్నికల కమిషన్‌ను కలిసి పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అంతేగాకుండా ఎన్నికల వేళ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని వారిని నమ్మవద్దన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాఘవరెడ్డి, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామానుజన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

పింఛన్లు రావాలంటే 'చంద్రన్న' రావాలి

ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

ఆగిన పింఛన్లు మళ్లీ రావాలంటే టిడిపి అధినేత చంద్రన్న ప్రభుత్వం రావాల్సిందేనని ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపల్లి, వెంకన్నపల్లి, గోపురాజుపల్లి, బాలాపురం, పి.చింతలపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముట్టిమడుగు కేశవరెడ్డి, సీనియర్ నాయకులు బాలరంగయ్య, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌నాయుడు, గోవర్ధనరాజు, రాముమునిరెడ్డి, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, బ్రహ్మయ్య, రంగయ్య, శ్రీనివాసులునాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దస్తగిరి, రామచంద్రనాయుడు, జయచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ

వైసిపిలో చేరిన డాక్టర్ శాంతిప్రియ

గుత్తి : పట్టణంలోని శాంతిప్రియ ఆసుపత్రి ఎండి, లయన్స్ క్లబ్ పామిడి మండల అధ్యక్షురాలు, సామాజిక కార్యకర్త డాక్టర్ ఎం.శాంతిప్రియ బుధవారం వైసీపీలోకి చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శాంతిప్రియతోపాటు ఆమె స్నేహితురాలు భాగ్యకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామని డాక్టర్ శాంతిప్రియ తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి బి.శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, నాయకులు సి.మల్లయ్య యాదవ్, ఎం.రంగస్వామి, డి.షఫీ, మాజీ ఎంపిటిసి డి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.



డాక్టర్ శాంతిప్రియకు కండువా కప్పుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి

పింఛను పంపిణీపై సమీక్ష

పుట్లూరు : మండలవ్యాప్తంగా పింఛన్ పంపిణీపై బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దస్తగిరి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పింఛన్ ఎలా పంపిణీ చేయాలి.. వికలాంగులు, నడవల లేని వారు, అనారోగ్యవారిన పడిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఇఓఆర్‌డి ఆనందప్రసాద్, ఎపిఎం వెంకట్రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : పింఛన్ల పంపిణీపై మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎడ్యుకేషన్ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

చంద్రబాబు వల్లే పింఛనుదారులకు కష్టాలు

అనంతపురం : టిడిపి అధినేత చంద్రబాబు కుట్రల వల్లే పింఛన్‌దారులకు కష్టాలు వచ్చాయని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. బుధవారం నగరంలోని 35వ డివిజన్‌లో ఇంటింటికీ వైసీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ గాలి వీస్తోందన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ మెజార్టీ సీట్లు సాధిస్తామన్నారు. ఐదేళ్లలో మేం అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిపై ప్రజలు నమ్మకంతో ఉన్నారన్నారు. జగన్ సీఎంగా ఉంటేనే తమకు మంచి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు.

టిడిపికి ఎంఆర్‌పిఎస్ మద్దతు

రాయదుర్గం : ఎన్‌డిఎ కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఎంఆర్‌పిఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేయనున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. కాగా రాయదుర్గంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఎన్.కృష్ణ బుధవారం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్, ఉపాధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, జనసేన నియోజకవర్గం కన్వీనర్ మంజునాథ్ గౌడ్, నాయకులు గోవింద, వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు గోవింద, తిప్పేస్వామి, హనుమంతు, సుధాకర్, మలకన్న, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

చీనీతోట పరిశీలన

పెద్దపప్పూరు : మండలంలోని నామనాంకపల్లి గ్రామంలో తెగులు వచ్చి తొలగించిన చీనీ తోటను ఉద్యానవన అధికారిణి ఉమాదేవి బుధవారం పరిశీలించారు. తెగులు సోకి గ్రామంలోని ఓ రైతు 400 చీనీ చెట్లను నరికివేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన ఉద్యానవన అధికారిణి ఉమాదేవి గ్రామానికి చేరుకుని నరికిన చీనీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పండ్ల తోటలకు వేరుకుళ్లు, బంక తెగుళ్లు, పొలుసు పురుగు వంటి సమస్యలు ఉన్నాయన్నారు. వీటికి అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం అధికారి, రైతులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

తాడిపత్రి రూరల్ : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 2న మండల పరిధిలోని చుక్కలూరు గ్రామానికి చెందిన రైతు మిద్దె గోపాల్‌రెడ్డి చీనీ తోటను కాపాడుకునేందుకు బోర్లు వేసి అప్పులపాలయ్యాడన్నారు. అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు గోపాల్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, బ్యాంకు రుణాలను మాఫీ చేయాలన్నారు.

ముస్లిములకు విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లిములు

అనంతపురం : నగరంలోని గుత్తి రోడ్డు సర్కిల్‌లో ఉన్న గ్లోబల్ ఇండస్ట్రీస్ డబ్ల్యు పివిసి సంస్థ ఆధ్వర్యంలో ముస్లిములకు బుధవారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధినేతలు మంజునాథరెడ్డి, రాజారెడ్డి మాట్లాడుతూ హిందూముస్లింలు ఐక్యతతో మెలగడానికి అన్ని పండుగలు జరుపుకోవాలన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని దాదాపు 500 ముస్లిములకు విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిములు, గ్లోబల్ ఇండస్ట్రీస్ సంస్థ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో మజీద్ ముతవలి బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ ఇందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేసే ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఎంతో పుణ్యమన్నారు.

రక్తదాన శిబిరం

అనంతపురం : జాతీయ యువజన అవార్డు గ్రహీత, యూత్ ఐకాన్ బిసాటి భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం అనంతపురంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ శిశుగృహంలో చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కాగా బిసాటి భరత్‌కు కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, కె.జయమారుతి, అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, ఎస్.రాజా, కె.మహేంద్ర, గణేష్, నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పింఛను పంపిణీకి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి

నార్పల : సామాజిక పింఛన్ల పంపిణీలో జాప్యం లేకుండా అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో అధికారికి వినతిప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమాల నుంచి వాలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈనేపథ్యంలో పెన్షన్లను సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఆదేశాలిచ్చారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి వెంటనే పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిఎల్ లక్ష్మీనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి నాగభూషణ, కేసేపల్లి నాగేంద్ర, రాంభూపాల్‌రెడ్డి, రామానాయుడు, నాగేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

రాయదుర్గం : పట్టణంలోని 6, 7వ ఎన్నికల వార్డుల్లో వైసిపి నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎన్నికల అబ్జర్వర్ పామిడి వీరాంజనేయులు, ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప దగ్గరకు సంక్షేమం రావాలంటే మరోసారి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ శిల్ప, శివప్ప, శివ, రవి, తదితరులు పాల్గొన్నారు.